# చెల్లియో... చెల్లకో!

## మానం పద్మజ

పెద్దగా కూతపెట్టి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ కాళహస్తి స్టేషన్ నుంచి బయల్దేరింది. స్నేహితుడి పెళ్ళికోసమని శ్రీకాళహస్తి వచ్చాను. రూటు కొత్త. ఆర్‌ఏసిలో సీటు దొరికింది. బెర్త్ ఇంకా కన్‌ఫర్మ్ కాలేదు. బ్రీఫ్‌కేస్ సీటుకిందకు తోసి సర్దుకు కూర్చున్నాను.

ఎదురుగా ఒక పెద్దావిడ కూర్చునుంది. పక్కసీటు చివరో కాలేజీ స్టూడెంట్ కూర్చున్నాడు. ఆ ఎదురు సీట్లో మూడు పంచెకట్లు వున్నాయి. పార్టీ పనిమీద భాగ్యనగరానికి బయల్దేరినట్లున్నారు. నిండా రాజకీయాల్లో మునిగిపోయారు.


అందరూ సర్దుకున్నారనుకున్న తర్వాత ''ఇక్కడ్నుంచి వెంకటగిరి స్టేషన్‌కి ఎంత సమయం పడుతుంది'' ఎదురుగా కూర్చున్నవాళ్లలో ఒక ఆసామిని అడిగాను.

''అరగంట'' అని చెప్పి మళ్ళీ ఆయన ఊరి రాజకీయాల్లో పడిపోయాడు.

ఎదురుగా కూర్చున్నావిడ కన్నార్పకుండా కిటికీలోంచి తదేకంగా బయటకు చూస్తూనే వుంది. కాలేజీ కుర్రాడు సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతున్నాడు. అక్కడున్న వాళ్ళతో నేను మాట్లాడగలిగేదేమీ లేదనేది అర్థమయిపోయింది. మ్యాగజైన్ తీసుకున్నాను. మరాఠీ కథ ముగింపులో వుండగా దూరంనుంచి 'చెల్లియో... చెల్లకో' అన్న పద్యం వినపడింది. చూపులు పుస్తకం మీదున్నా చిత్తం పద్యంవైపుకు పరిగెట్టింది. ఆ పద్యం నా చిన్నప్పటి జ్ఞాపకం.

ఒకసారి ఇంట్లోవాళ్ళకి చెప్పకుండా శ్రీరామనవమి పందిట్లో 'శ్రీకృష్ణరాయబారం' వేస్తుంటే వెళ్ళాను. నాటకం అయిపోయేసరికి తెల్లవారుఝాము మూడయింది. దొంగలాగా గోడదూకి ఇంట్లోకెళదామనుకున్నాను. గోడయితే బాగానే దూకాను కానీ మెలికపడి కాలిరిగింది. కేకలు, పెడబొబ్బలతో ఇంట్లో అందరూ లేచారు. ఆ తరువాత కాలికి పిండికట్టు తలవాచేట్లు చివాట్లు - ఆపై నెలరోజుల విశ్రాంతి.

రెండు నిముషాల్లో దూరంగా వున్న పద్యం దగ్గరయింది. తలెత్తి చూశాను. నిలువెత్తు మనిషి. ఛామనఛాయకు ఒకరంగు తక్కువే వున్నాడు. వయసు అరవై వుండొచ్చేమో! కానీ జుట్టు నల్లగా నిగనిగలాడుతోంది. కోటేరు ముక్కు. శరీరం మొత్తం గీకినా ఎక్కడా ఒక చెంచాడు కొవ్వైనా వచ్చేట్లు లేదు. కానీ నిండుగా వున్నాడు. తీరైన పలువరుస. నీరుకావి రంగు పంచెను లుంగీలాగా చుట్టుకున్నాడు. ముదురు నీలంరంగు చొక్కా చేతుల్ని మోచేతుల



వరకు మడిచాడు. ఒక చేతిలో శుభ్రమైన పెద్ద సంచి. దగ్గరగా వచ్చేటప్పటికి పాడే పద్యానికనుగుణంగా అతని మొహంలోని హావభావాలు కూడా కన్పడుతున్నాయి.

పక్కనున్న కాలేజీ కుర్రాడు, పెద్దావిడ అతనికి చిల్లర ఇచ్చారు. 'ఎంత శుభ్రంగా వున్నాడు. అతనడుక్కునేవాడా!' ఆశ్చర్యపోయాను.

అతను పద్యంలో లీనమైపోయి పాడుకుంటూ వెళ్తున్నాడే కానీ ఎవరి దగ్గరా చెయ్యి చాపట్లేదు. ఇచ్చేవాళ్ళు ఇస్తున్నారు.

పద్యం పాడటం తప్పితే తన జీవితధ్యేయం ఇంకేమీ లేదన్నట్లుగా పాడుతున్నాడు. అతను తీసే రాగం ఎక్కడా శ్రుతి, లయ తప్పకుండా అతిశ్రావ్యంగా సాగుతోంది. అతని కంఠం ఖంగుమంటోంది. ఆ కంఠంలో ఏదో వశీకరణమున్నట్లు వుంది.

'సుపుత్రుడు పదో తరగతికి వచ్చాడే కానీ రెండు వత్తులున్న పదం పలకమంటే ఇప్పటికి వాడికి నోరు తిరగదు. ఈ అడుక్కునేవాళ్ళు ఎట్లా పట్టుకుంటారో కానీ కొన్ని పాటల్ని, పద్యాల్ని మహా స్పష్టంగా పలుకుతారు. అవసరమే వాళ్ళకన్నీ నేర్పుతుందనుకుంటా! కోటి విద్యలు కూటికొరకే అని అందుకే అన్నారు. తన కొడుకైతే పద్యాలు వల్లెవేసే ప్రతిసారీ 'ఎందుకు రాస్తారీ నోరు తిరగని పద్యాలు' అని విసుక్కుంటాడు'.

ఆలోచనల్లో వుండగానే పద్యం దూరమయింది.

దమ్ముకొట్టి చాలాసేపయింది. అదీకాక బెర్త్ కన్ఫర్మ్ చేయించుకోవాలంటే టి.సిని టాయ్‌లెట్స్ దగ్గరే పట్టుకోవడం మంచిది. దాంతో వెళ్ళి డోర్ దగ్గర నిలబడి సిగరెట్ తీశాను. ఆ పెట్టెలో అడుక్కోవడం అయిపోయిందేమో! అక్కడ అప్పటికే 'పద్యం' కూర్చుని సంచి సర్దుకుంటున్నాడు.

'నేనిందాక డబ్బులివ్వలేదు కదా! ఇప్పుడడుగుతాడేమో!' అనుకుంటూ సిగరెట్ వెలిగించుకుందామని అగ్గిపెట్టెకోసం జేబులో చెయ్యిపెట్టాను.

'పద్యం' నావంకే చూస్తున్నాడు. జేబులో చెయ్యిపెట్టేసరికి డబ్బులిస్తానేమోనని చూస్తున్నట్లున్నాడు!

'ప్చ్! అగ్గిపెట్టె లేదు!' ఖాళీ చెయ్యి బయటికి వచ్చింది.

''ఇదిగో సారూ!'' పద్యం అగ్గిపెట్టె అందించాడు.

నేను సిగరెట్ అంటించుకునేలోపు మడిచిన చొక్కా చేతుల్లోంచి బీడీ తీశాడు. తిరిగిచ్చిన అగ్గిపెట్టెతో బీడీ వెలిగించుకున్నాడు.

ఇంకో పావుగంటలో వెంకటగిరి స్టేషన్ వస్తుంది. స్టేషన్‌కి తన కొలీగ్ సురేష్ వాళ్ళ నాన్న వచ్చి తనకో కవరు అందజేస్తాడు. అది తను సురేష్‌కి అందజేయాలి. టి.సి. సీటు ఖాళీగా వుండడంతో దమ్ముకొడుతూ అక్కడే కూర్చుండిపోయాను.

సురేష్ వాళ్ళది వెంకటగిరి పక్కన చిన్నఊరు. తల్లిదండ్రులకి ఒక్కగానొక్క కొడుకు. భార్య కూడా టెలిఫోన్స్‌లో పనిచేస్తుంది. ఇద్దరు పిల్లలు. తల్లిదండ్రీ ఊర్లోనే వుంటారు. అక్కడ వీళ్ళకో పదెకరాల భూమి వుంది కానీ పంటలు మాత్రం సరిగా పండవంటారు. ఆలుమగలిద్దరూ ఇల్లు కొనుక్కోవాలని ఆలోచన చేశారు. హౌస్ లోన్ తీసుకున్నా ఇంకా కొంచెం డబ్బు తక్కువ పడడంతో ఊర్లో వున్న పదెకరాల పొలానికి తనొక్కడే వారసుడు కాబట్టి దాని మీద వచ్చే రాబడి కూడా అంతంతమాత్రం కాబట్టి దాంట్లోంచి ఒక ఐదెకరాలు అమ్మి డబ్బు పంపమని తండ్రికి ఉత్తరం రాశాడు.

''నువ్వెలాగూ వాళ్లని ఇక్కడకు తీసుకురావు. కనీసం పొలమన్నా వుండనివ్వాల్సింది'' అని తను సలహా చెప్పబోతే, 'వాళ్ళున్నారనే కదా మిగిలిన ఐదెకరాలు వుంచాను'' అని సమాధానం చెప్పాడు సురేష్.

సురేష్ తండ్రి పొలం అమ్మి డి.డి. తీసుకున్నానని ఫోన్ చేశాడట. నేను స్నేహితుడి పెళ్ళికి కాళహస్తి వెళ్తున్నానని చెప్తే తండ్రి దగ్గర్నుంచి ఆ డి.డి. తెచ్చే బాధ్యత నామీద పెట్టాడు.

'అప్పు చేస్తే పోయేదానికి పొలం అమ్మాడు. పోనీ తల్లిదండ్రుల్ని తన దగ్గరుంచుకుంటాడా అంటే అదీ లేదు. ప్రతిబంధమూ వ్యాపారాత్మకమే! ఈ లోకంలో ఆర్థికం కాని సంబంధాలేమన్నా వున్నాయా?' అని ఆలోచనలో పడ్డాను.

''హైదరాబాదా?'' వున్నట్టుండి విన్పించిన ప్రశ్నకి ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి తేరుకుని చూశాను.

ఎదురుగా 'పద్యం' గొంతుక్కూర్చుని తన్మయంగా బీడీ పీలుస్తూ నన్ను ప్రశ్నిస్తున్నాడు.

''చతురంభోధిపరీత భూవలయ
రక్షాదక్షచామీకరా
యత దండంబు ధరించు ఈ
కరమె ఆహా! ఇప్పుడిక్కాటిలో
చితిలో కాలుచునున్న యీ కొరివి
దాల్చెన్ నవ్యమాణిక్యరా
జిత నీరాజన కాంతికిన్ బదులు
వచ్చెన్ శోచనీయంబుగన్''

అవునన్నట్లు తలూపాను.

''ఎప్పుడైనా రవీంద్రభారతికెళ్ళావా?'' తిరిగి ప్రశ్నించాడు.

మళ్ళీ తలూపాను.

''అక్కడ నాటకం ఆడాలని మహా కోరికగా వుండేది!'' అన్నాడు.

పద్యమయితే స్పష్టంగా పాడాడు కానీ మాటలు యాసగా ఒరవడిగా మాట్లాడుతున్నాడు. అందులోనూ ముందు వెనకలేమీ లేకుండా మాట్లాడుతుండడంతో సందర్భం తొందరగా అర్థం కావట్లేదు.

అతను నాలుగు మాటలు చెప్పేది చివరకు నాలుగు రూపాయలు అడుక్కోవడానికే కదా! అందుకే పద్యాన్ని పట్టించుకోకుండా సిగరెట్ కాల్చుకుంటూ కిటికీలోంచి బయటకు చూడడం మొదలెట్టాను.

'వెంకటగిరి స్టేషన్ ఇంకెంతసేపట్లో వస్తుందో!'

విద్యుత్ దీపాల కాంతి దగ్గరపడుతోంది. ఏదో స్టేషన్ వస్తున్నట్లుంది.

''వచ్చేది వెంకటగిరేనా?'' పద్యాన్ని అడిగాను.

''ఇక్కడ రైలాగదు. వెంకటగిరి స్టేషన్ రావడానికింకో పదేను నిముషాలు పడుతుంది'' అన్నాడు.

అతనామాట అంటుండగానే స్టేషన్‌కి కూతవేటు దూరంలో రైలాగింది.

అతను లేచొచ్చి గుమ్మం దగ్గర్నుంచుని బయటికి తొంగిచూస్తూ 'క్రాసింగు' అన్నాడు.

తర్వాత నావంక తిరిగి ''వెంకటగిరి స్టేషన్‌కి ఎవరైనా వస్తారా?'' అని అడిగాడు.

అవునన్నట్లు తలూపాను.

గతాన్ని నెమరువేసుకుంటున్నట్లుగా ''అప్పట్లో వెంకటగిరి నాటక సంస్థ వుండేది. తెలుగు పాటలు రాసేవాడు చూడు 'ఆత్రేయ' అని ఆయన ఎన్.జి.వో. అనే నాటకం రాశాడు. దానికి అప్పట్లో చాలా అవార్డులు వచ్చాయ్‌లే!'' అన్నాడు.

''రైలిక్కడెంతసేపు ఆగుతుంది'' అతని మాటలు పట్టించుకోకుండా అడిగాను.

''క్రాసింగయితే పది నిముషాల్లో బయల్దేరుతుంది. సిగ్నలునుకో ఒక్కోసారి అరగంటైనా పడుతుంది'' అన్నాడు.

'క్రాసింగంటేనే కదా సిగ్నలు! తిక్కల వ్యవహారం కాకపోతే!' అని మనసులో అనుకున్నాను.

కిటికీలోంచి బయటకు చూశాను. నల్లటి ఆకాశం, మిణుకుమిణుకుమనే నక్షత్రాలు తప్పితే ఇంకేం కనబడ్లేదు.

'ఇక ఇతన్తో కాలక్షేపం తప్పేట్లు లేదు!' అనుకుని,

''అన్నీ నాటకాల కబుర్లే చెప్తున్నావ్! నాటకాల్లో ప్రవేశం వుందా!'' అని అడిగాను.

నా ప్రశ్నకు సమాధానంగా..

''చతురంభోధిపరీత భూవలయ రక్షాదక్షచామీకరా

యత దండంబు ధరించు ఈ కరమె ఆహా! ఇప్పుడిక్కాటిలో

చితిలో కాలుచునున్న యీ కొరివి దాల్చెన్ నవ్యమాణిక్యరా

జిత నీరాజన కాంతికిన్ బదులు వచ్చెన్ శోచనీయంబుగన్''

అనే పద్యాన్ని రాగయుక్తంగా పాడాడు.

పద్యం ముగించి ''అప్పట్లో హరిశ్చంద్రుడేషం, కృష్ణుడేషం వేసేవోడ్ని'' అన్నాడు.

''తర్వాతేమయింది?'' ప్రశ్నించాను.

నా ప్రశ్ననేమాత్రం విన్పించుకోకుండా చేతికున్న వెండి వుంగరం చూపిస్తూ ''ఇప్పటికిది మిగిలింది కానీ వెంకటగిరి రాజావారు తులం బరువుండే బంగారపుటుంగరం తొడిగారు'' అని గుమ్మం దగ్గర్నుంచి కదిలి కంపార్ట్‌మెంట్ గోడనానుకుని గొంతుక్కూర్చున్నాడు.

''వెండి వుంగరం చూపించి బంగారం పెట్టారని చెప్తున్నావే?'' నవ్వాను.

గాఢంగా నిట్టూర్చి ''ఆ బంగారవూ పోయింది. నా బంగారవూ పోయింది'' అని తలొంచుకున్నాడు.

అతని మాటలు అర్థం చేసుకోవాలని ప్రయత్నించాను. కానీ ఏమీ బోధపడ్డేదు. అతని పట్ల కొంచెం ఉత్సుకత జనించింది.

అతనివంకే చూస్తున్నాను.

తలెత్తి చూపు ఎటూ నిలపకుండా తనలో తను మాట్లాడుకుంటున్నట్లుగా 'బంగారం!' అని ఒక క్షణ

మాగి మళ్ళీ మొదలెట్టాడు. "నా బంగారం నా పక్క నున్నంతకాలం నాకేలోటూ రాకుండా చూసింది. 'సంపాదించావా! లేదా!' అని నన్నెప్పుడూ అడగ లేదు. వుంటే తినేవోళ్ళం. లేకుంటే పస్తులుండే వాళ్ళం. అయినా అప్పట్లో కొంచెం పొలముండేదిలే! దాంతో తినడానికెప్పుడూ లోటుబడ్లే!" అని నావంక తిరిగి మూడువేళ్ళు చూపిస్తూ "ముగ్గురు మగపి ల్లలు. ఎవ్వడికీ చదువబ్బలేదు. వాళ్ళు చేతికందేసరికి వున్న పొలమూ కరిగిపోయింది. నీ నాటకాల పిచ్చికి మమ్మల్ని బలిచేశావని కొట్టడానికొచ్చారు. మీ బతుకు మీరు బతకండని వాళ్ళని బయటకు తరిమి నన్ను అక్కున చేర్చుకుంది నా బంగారం. అటు వంటి బంగారానికి సుస్తీ చేసింది" అని ఆగి వుంగరం వేలివంక చూస్తూ "నా బంగారం కంటే ఈ బంగారం ఎక్కువేం కాదు అనుకున్నాను. అందుకే అమ్మేశాను" అన్నాడు.

ఆ తర్వాత గొంతు తగ్గించి "అయినా నా బంగారాన్ని బతికించుకోలేకపోయాను" అన్నాడు. ఆ మాట చెప్తుంటే పద్యం మొహం చిన్నబోయింది.

గాఢంగా నిట్టూర్చి "ఆ బంగారవూ పోయింది. నా బంగారవూ పోయింది" అన్నాడు భారంగా.

కాసేపు ఇద్దరం మౌనంగా వుండిపోయాం.

మళ్ళీ తనే తేరుకుని "అప్పట్లో నాటకం ఆడటా నికి పోతే ఊర్లో పెద్దలు రోజుకొకరు భోజనానికి పిల్చేవారు. ఎవరూ పిలవనిరోజు కండువా తీసుకుని రెండు మూడిళ్ళు తిరిగితే చాలు ట్రూప్ మొత్తానికి సరిపడా బియ్యం పోసేవాళ్ళు. దొడ్లో కాసిన కూరగా యలిచ్చేవాళ్ళు. వ్యవసాయదారులు ఖాళీగా వుంటా రని చలికాలంలోనే ఎక్కువగా నాటకాలేసేవోళ్ళం. వెలుతురికి పెట్రోమాక్స్ దీపాలు పెట్టుకునేవాళ్ళం. బేటరీ మీద ఒక మైకు లాగేవోళ్ళం. అందరూ ఆ మైకు దగ్గరకొచ్చే డైలాగులు చెప్పేవోళ్ళు. అప్పట్లో మైకు లేకపోయినా నా గొంతు ఖంగుమనేది. మైకు లేకపోయినా ఈడి రాగం మూడూళ్ళకి ఇనపడత దిరా నాయాల్డి అనేవోళ్ళు" అని ఒక ఒరవడిలో చెప్పుకుపోతున్నాడు 'పద్యం'.

"కొడుకులేం చేస్తున్నారు?" అడ్డు తగిలాను.

"పెద్దగా చదువులు చెప్పించలేదు. ఆస్తి మిగల్చ లేదు. ఇంకేం చేస్తారు? ఏవో చిన్నాచి తకా ఉద్యోగాలు చేసుకుంటు న్నారు" అన్నాడు నిర్లిప్తంగా.

"ఈ వయసులో ఇట్లా తిర క్కుండా నువ్వు కూడా వాళ్ళతోనే వుండొచ్చు కదా!" కుతూహలంగా అడిగాను.

"ఇవాళ రేపు అపురూపంగా పెంచిన పిల్లలే తల్లిదండ్రుల్ని చూడ ట్లేదు. తండ్రిగా వాళ్ళనేం పట్టించు కున్నానని వాళ్ళ దగ్గరికి వెళ్ళాలి. వాళ్ళ బతుకేదో వాళ్ళని బతకనీ!" అన్నాడు చేతులు తిప్పుతూ నిర్లి ప్తంగా.

"వెంకటగిరి తర్వాతి స్టేష నేంటి?"

"గూడూరు సావిత్రితో కూడా వేశాను. కానీ రెండే డైలాగులు" అన్నాడు నా ప్రశ్నకు సమా ధానంగా.

అప్పటికే రైలాగి చాలాసేపయింది. గాలి కూడా మెసలట్లేదు. దాంతో చాలా చిరాగ్గా వుంది. 'వెంకట గిరి తర్వాత గూడూరేమో! అందుకనే ఈయనగారికి గూడూర్లో వేసిన నాటకం గురించి గుర్తొచ్చినట్లుంది. వింటున్నాను కదాని మరీ రెచ్చిపోతున్నాడు. ఈ అడుక్కునేవాడు మహానటి సావిత్రితో కలిసి నటిం చాడంట! అది నేను నమ్మాలంట!'

"మహానటి సావిత్రి నాటకాల్లో కూడా వేషాలు వేసేదా!" వ్యంగ్యంగా అడిగాను.

"ఆ సావిత్రికాదు. గూడూరు సావిత్రి. ఆమెది కడప" అన్నాడు.

'ఈ రైలెక్కడింకెంతసేపు ఆపుతాడో! వీడు నన్ను తినేస్తున్నాడు!' లేచి గుమ్మం గద్గరికెళ్ళి నిలబడ్డాను.

"సినిమా వాళ్ళలో నాగభూషణం గారి 'రక్తక న్నీరు' బాగా ఆడేది. దాన్ని టికెట్ కొనుక్కుని మరీ చూసేవాళ్ళు" వెనకనుంచి స్వగతంలో మాట్లాడు కుంటున్నట్లుగా అన్నాడు.

అంతలోకి కాఫీ వచ్చింది. బుర్ర వేడెక్కిపోవ డంతో ఒక కాఫీ తీసుకున్నాను. ఎదురుగానే వున్నా డని పద్యానిక్కూడా ఒక కాఫీ ఇమ్మన్నాను.

'ఐదు రూపాయలు ధర్మం' అనుకున్నాను.

కానీ పద్యం కాఫీ తీస్కోవడానికి మొహమాటప డ్డాడు.

"ఏంది! సారు బుర్ర తింటుండావా! డబ్బులు సారిస్తార్లే తీసుకో!' అని కాఫీ కప్పు అతని చేతిలో పెట్టాడు కాఫీ అమ్మే అతను.

పర్సులోంచి వంద రూపాయలు తీశాను. చిల్లర లేదు మళ్ళీ వచ్చి తీసుకుంటానని కాఫీ అమ్మే అతను వెళ్ళిపోయాడు.

'పద్యం' కాఫీని ఊదుకుంటూ జుర్రున రెండు గుక్కలు తాగి పెద్దగా చప్పరించి కప్పు కింద పెట్టి పద్యం అందుకున్నాడు.

"బావా ఎప్పుడొచ్చితీవు... బావా ఎప్పుడొచ్చితీవు!" అని తీసిన రాగమే తీస్తున్నాడు.

'వేడివేడి కాఫీ రెండు గుక్కలు పడగానే చురుకు పుట్టిన ట్లుంది' అని నవ్వొచ్చింది నాకు.

"ఇప్పుడే వచ్చా బామ్మర్దీ... ఏంటి కబుర్లు!" అనుకుంటూ వెళ్ళాడు బఠాణీలు అమ్మే అతను, అతని పక్కనుంచి.

"ఛూ! పోరా నాకొడకా!" కసిరాడు పద్యం.


"అప్పట్లో నేను 'చెల్లియో... చెల్లకో' అని గొంతె త్తితే ఒన్స్‌మోర్‌లు కొట్టి రాత్రంతా అదే పాడించుకు నేవాళ్ళు. తర్వాతర్వాత ఆ పద్యం ఎత్తుకుంటే చాలు 'ఏంది చెల్లంది వంద రూపాయల నోటా' అనేవోళ్ళ ఇట్టాంటి నాకొడుకులే" అని బఠాణీలమ్మేతను వెళ్ళి నవైపు కోపంగా చూశాడు.

"పల్లెటూళ్ళలో అప్పట్లో పెళ్ళిళ్ళకి, దినాలకి స్పెషల్‌గా నాటకాలేయించేవాళ్ళు. చూడటానికొచ్చే వాళ్ళు ఎవరి చాపలు వాళ్ళు తెచ్చుకుని కూర్చునే వారు. భోజనం ఖర్చులవీ ఊరిమీద వెళ్ళమారిపో యేవి. ఊర్నించి వెళ్లేటప్పుడు ఎవరి తాహతుకొద్దీ వాళ్ళు చేతిలో డబ్బులు పెట్టేవారు. ఇప్పుడు నాటక మంటే పాత చింతకాయ. ఎవడికి రుచిస్తుంది. సిని మాలొచ్చింతర్వాత సీనే మారిపోయింది. నాటకా ల్రాసినా, వేసినా డబ్బుల్లేవొస్తాయ్! అదే సినిమాల యితే డబ్బులే డబ్బులు. టికెట్ కొని సినిమా చూస్తారు కానీ నాటకం మాత్రం ఊరికే ఆడాలి. అప్పట్లో సినిమా వాళ్ళంతా మద్రాసులో వుండే వాళ్ళు కదా! అయినా అరవోళ్ళలాగో, బెంగాలీల్లాగో మన సినిమావోళ్ళు నాటకాన్ని పట్టించుకోలేదు" అని చప్పరించేశాడు.

కాసేపాగి మళ్ళీ మొదలెట్టాడు.

"పౌరాణిక నాటకాలేయాలంటే నగలకి, బట్ట లకి బోల్డు ఖర్చు. అదీగాక సమాజం కూడా మారి పోయింది. దాంతో తర్వాతర్వాతన్నీ సాంఘిక నాట కాలే! జిల్లాకొక కళ్యాణ మండపం కట్టినట్లు తాలూకాకొక థియేటర్ కట్టి 'ఫ్రీగా నాటకా లాడుకోండ్రా నాయాళ్ళల్లారా!' అనొచ్చు కదా! ఉహూఁ...! వీధికో సారాకొట్టు, సెంట రుకో సినిమా థియేటరు మాత్రం తెరిచే శారు పుండాకోరొధవలు... ఛూ...!" అని చివర్లో ఆవేశపడ్డాడు 'పద్యం'.

'రవీంద్రభారతి చూశావా! అక్కడ నాటకాలెయ్యాలంటే చాలా ఖర్చవుతుం




ఒక రాజకీయనాయకుడు ప్రయాణిస్తున్న విమానాన్ని ఒక టెర్రరిస్ట్ హైజాక్ చేసాడు. పైలట్‌కి తుపాకి గురిపెట్టి "మర్యాదగా ఆఫ్ఘనిస్తాన్‌కి పోనివ్వు... లేదంటే తల పేలిపోతుంది" అన్నాడు.
పైలట్ నవ్వి "నన్ను చంపితే, ఈ విమానం కూలి నువ్వు కూడా చస్తావ్" అన్నాడు.
వెంటనే కోపైలట్‌కి గురిపెట్టి "వీడి తల పేలుద్ది" అన్నాడు టెర్రరిస్ట్.
పైలట్ నవ్వి "ఇది లారీ, బస్సు కాదమ్మా విమానం. దీనికి ఇద్దరు డ్రైవర్లు వుండాల్సిందే. వాడు చస్తే, కంట్రోల్ చేతగాక నేను చేతులెత్తేస్తాను. అప్పుడందరం...."
టెర్రరిస్ట్‌కి కోపమొచ్చి రాజకీయనాయకుడి తలకు గురిపెట్టి "చెప్పిన మాట వినకపోతే వీడి తల పేలుద్ది" అన్నాడు.
పైలట్ పకపక నవ్వి "ఆయన పొలిటీషియన్, ఆయనకు తలా వుండదు, అందులో మెదడూ వుండదు. ఇంకేటి నువ్వు పేల్చేది దీపాళి టపాకాయ్?" అన్నాడు.

దంట కదా!'' మళ్ళీ మొదటి ప్రశ్నలోకి వచ్చాడు.

అతని తీరు చూస్తుంటే 'నీతోపాటు హైదరాబాదొస్తాను. రవీంద్రభారతి చూపించు' అనేట్లున్నాడు. ఒకవేళ మొహమాటం కొద్దీ అతన్ని నాతోపాటు తీసికెళ్ళినా, నాకున్న అద్దెకొంపలో అతన్నెక్కడ వుంచాలి. నా సతీమణి చిరాకుల్నెలా భరించాలి. నేరకపోయి ఇక్కడ కూర్చున్నాను. ఏదోలే ఇంతసేపు మాటల కాలక్షేపం చేశాను కదా! దిగేముందు వో పది రూపాయలిద్దాంలే అనుకున్నాను. అందరితోపాటు రూపాయి పడేస్తే పోయేవాడికి ఇక్కడ కూర్చుని అనవసరంగా వీడికిదొరికి పోయాను అని కంగారుపడ్డాను.

''నేనెప్పుడూ హైదరాబాదు చూడ్లేదు! మాద సలు గుంటూరు'' అన్నాడు మళ్ళీ పొడిగిస్తూ.

నా అనుమానం రూఢి అయింది. పూర్వరంగం సిద్ధం చేస్తున్నాడు. ఇంకో క్షణంలోనైనా 'నేను కూడా నీతో హైదరాబాదు వస్తా'నంటాడు.

''అక్కడ ఆర్టిస్టుల కోసం చాలా కట్టారంట కదా!'' అని నా సమాధానం కోసం ఎదురుచూడకుండానే ''టూరిస్టు ప్రదేశాల్లో దాని ప్రాముఖ్యతని బట్టి నాటకాలాడించొచ్చు కదా! ఉభయతారకంగా వుంటుంది'' అన్నాడు.

''అంటే?'' అడిగాను.

''గోల్కొండుందనుకో, దాన్ని చూడడానికొచ్చే వాళ్ళకోసం అక్కడ నిజాంరాజుల చరిత్రో, భక్త రామదాసు గురించో ఆడించాలి. అలాగే వెయ్యి స్తంభాల గుడి చూడడానికొచ్చే వాళ్ళకక్కడ కాకతీయ రాజుల వైభవం రాయించి ఆడించాలి. అట్లాగన్నమాట''.

సిగ్నల్ ఇచ్చినట్లున్నారు. రైలు బయల్దేరింది. కిటికీలోంచి చల్లటి గాలి రివ్వున మొహానికి తగలడంతో ఆహ్లాదంగా వుంది. అప్పటివరకు వున్న చికాకు మాయమైంది.

''పద్యానికి స్టఫ్ బాగానే వున్నట్లుంది'' అనుకున్నాను.

''అప్పట్లో రేడియోల్లో సంగీత నాటకాలేసే వాళ్ళు'' అన్నాడు పద్యం ఉత్సాహంగా.

''ఆహా!''

''తళుకు జలతార్ బుటాలద్దిన నీలవల్లయమ్మీ గుడారం, అఖిల సుఖదమ్మీ బిడారం, చేయిచేయి మెయిమేయి తగిల్చి చెంతనే వుండాలి ప్యారీ, చెలియమే మాపాలి హోరీ'' అని పాడి నావంక తిరిగి కళ్ళెగరేసి ''ఉమర్ ఖయ్యాం'' అన్నాడు.

''హిందీ కూడా వచ్చా'' నేనూ హుషారుగా అడిగాను.

''ప్చ్! రాదు! నాకిప్పుడు డెబ్బై. కానీ ఏ పాటైనా ఒక్కసారి వింటే చాలు ఇట్టే పట్టేస్తాను'' అన్నాడు చిటికేసి.

'పద్యం తక్కువోడు కాదు' అనుకుని ''సినిమా పాటలు కూడానా'' అడిగాను.

''ఆ సినిమా పాటల గురించి, డాన్సుల గురించి నాకు చెప్పబాకు. నడుంని నాలుగు రకాలుగా వూపితే డాన్స్ అవుతుందా!'' ఈసడించేశాడు.

''ఇది ఈమధ్యే అంటే వో పదేళ్ళకిందటి విషయమనుకో! మా ఊళ్ళో రుక్మిణమ్మ కూతురికి కూచిపూడి నేర్చుకోవాలని మహా కోరిక. కష్టపడి భామాకలాపం కూడా నేర్చుకుందనుకో! కానీ ఒకసారేమైందంటే!'' అని చెప్పటం ఆపి నవ్వుకున్నాడు.



## లగేజ్

ఒకాయన హెలికాప్టర్ అద్దెకు తీసుకుని ఒక ద్వీపానికి వెళ్లాడు. ద్వీపమంతా కలియతిరిగి అక్కడ దొరికే అరుదైన పళ్లను నాలుగు బస్తాల్లో ఎత్తి హెలికాప్టర్‌లో వేయబోయాడు. పైలట్ వారించి ''సార్ లోగడ ఇక్కడకు వచ్చినపుడు కూడా మీకు చెప్పాను. అనవసరమైన లగేజీ వేస్తే టేకాఫ్‌కి ఇబ్బందని'' అన్నాడు.

''కొంచెం సర్దుకోండి సార్, మనూళ్లో దొరకవు ఈ పళ్లు'' అని నాలుగు బస్తాలకు ఇంకో రెండు బస్తాలు అదనంగా వేసి ''రైట్'' అని డోర్ వేసాడు పెద్దమనిషి.

హెలికాప్టర్ వేగంగా ఒక్క ఎగురు ఎగిరి, మళ్ళీ అంతే వేగంతో చెట్లపైన కూలిపోయింది.

''ఏమైంది ఎక్కడున్నాం మనం'' అన్నాడు పెద్దమనిషి.

''గతంలో ఎక్కడైతే కూలిందో, దానికి కొంచెం ముందులోనే.... లగేజీ వద్దు మొర్రో అంటే వినరు'' అని తలపట్టుకున్నాడు పైలట్.

అతని నవ్వు చూస్తే నాకు ముచ్చటేసింది. అతని వంక అలాగే చూశాను.

బలవంతాన నవ్వాపుకుని చెప్పటం మొదలెట్టాడు.

''ఆ అమ్మాయికి నల్లగా నిగనిగలాడే గిరజాల జుట్టుండేది. అయితే పొడుగుండేది కాదు. సత్యభామేమో పొడుగాటి జడ పట్టుకుని అతిశయంగా 'భామనే... నే సత్యభామనే' అని అభినయించాలి కదా! జడ పొడుగ్గా లేకపోవడంతో నాట్యం నేర్చుకునేటప్పుడు జడ పట్టుకున్నట్లుగా చెయ్యెత్తి పట్టుకుని నడిచేది. చివరాఖరుకు స్టేజిమీద భామాకలాపం అభినయించేరోజు రానేవచ్చింది. పెద్ద సవరం పెట్టి చివర జడగంటలేసి దానికో నాగరం, జడబిళ్ళ లాంటి హంగులన్నీ అమర్చారు. కానీ అలవాటు చొప్పున ఆ అమ్మాయి జడని విలాసంగా వెనకే వదిలేసి ఒట్టి చెయ్యి మాత్రం పైకెత్తి 'నే ...భామనే' అని బయల్దేరింది. ఇంకేముంది పోకిరీగాళ్ళు 'చేతిలో జండా పెట్టండ్రో' అని అరిచారు'' అని చెప్పి ఆగి నవ్వాడు.

అతను చెప్పిన దృశ్యం ఊహించుకుంటే నాకూ నవ్వాగలేదు.

'పద్యానికి పది రూపాయలు కాదు, దిగేముందు యాభైయ్యయినా ఇవ్వొచ్చు' అని మనస్ఫూర్తిగా అనుకున్నాను.

''ఇన్ని విషయాలు తెలిసినవాడివి కుటుంబాన్నెందుకు నిర్లక్ష్యం చేశావు? దానివల్లే కదా! ఇప్పుడిలా కష్టపడుతున్నావు'' కొంచెం బాధగానే అడిగాను.

''అప్పటికీ ఇప్పటికీ నాకు వేరేలోకం లేదు. నాటకమే నా లోకం. చూసే మారాజులున్నంత కాలం బాగానే జరిగిపోయింది. చూసేవాళ్ళను బట్టే నాటకాలయినా, నాటకాలేసేవాళ్ళయినా. సురభి వాళ్ళు తప్పితే నాటకం మీద మాలాగా ఆధారపడిన వాళ్ళు ఇప్పుడేరి? మాలాంటి వాళ్ళ గతి చూసే కదా ఇప్పటివాళ్ళు జాగ్రత్తపడుతున్నారు. ఏదో ఒక ఉద్యోగం చేసుకుంటూనే నాటకాలు కూడా వేస్తున్నారు. నాటకాలే జీవితం అనుకునేవాళ్ళు మాతోనే చెల్లేమో!'' నిర్లిప్తంగా అన్నాడు.

నాటకాల గురించి నాకేమీ తెలీకపోవడంతో మొదట్లో అతన్ని చిన్నచూపు చూసినందుకు బాధేసింది.

పద్యం కిటికీలోంచి బయటకు చూస్తూ ''వెంకటగిరి స్టేషనొచ్చేసింది'' అన్నాడు.

సురేష్ వాళ్ళ నాన్నకోసం కిటికీలోంచి చూశాను. ఆయన కన్పడగానే చెయ్యూపాను. నేనున్న కంపార్ట్‌మెంట్ ప్లాట్‌ఫారంకి దూరంగా ఆగింది. కిందకు దిగి నిలబడ్డాను. అక్కడ రైలు రెండు నిముషాలే ఆగుతుందంట. సురేష్ వాళ్ళ నాన్న నావైపుకు పరిగెత్తుకుంటూ వచ్చాడు. అతనిచ్చిన కవరు తీసుకుని కుశలప్రశ్నలడుగుతుండగానే రైలు కదిలింది. హడావుడిగా రైలెక్కి మళ్ళీ మర్చిపోతానేమోనని కవరు బ్రీఫ్‌కేసులో పెట్టి తాళం వేశాను. అంతా సర్దుకున్న తర్వాత 'పద్యం' గుర్తురావడంతో గుమ్మం దగ్గరికి వెళ్ళాను. అక్కడతను లేడు. అటూఇటూ రెండడుగులు వెతికాను. పద్యం కనపడలేదు.

కాఫీ అమ్మే అతను మాత్రం కంపార్ట్‌మెంట్ గోడనానుకుని నుంచునున్నాడు.

అతన్ని 'పద్యమేడీ' అనడగబోయి తమాయించుకుని ''ఇక్కడుండే అడుక్కునే అతనేడీ?'' అనడిగాను.

''ఆ నాటకాల పిచ్చాయనా! ఆయన బతికి చెడిన మనిషేగానీ అడుక్కునేవాడు కాదు'' అని చెప్పాడతను.

''సరేలే! నీకు డబ్బులు ఇవ్వాలికదా! చిల్లరుందా?'' అని జేబులో చెయ్యి పెట్టాను.

''ఆ నాటకాల స్వామి మాటలెవరూ పట్టించుకోరు. మీరు ఆయన చెప్పిందంతా ఓపిగ్గా విన్నారంట కదా! 'మనసున్న మారాజు' అని మీ కాఫీ గూడా ఆయనే డబ్బులిచ్చి వెళ్ళాడు'' బదులిచ్చాడు కాఫీ అతను.

ఒక్కసారిగా హతాశుడ్నయ్యాను.

పద్యం కల్పించుకుని కబుర్లు చెప్తుంటే ఎక్కడ డబ్బడుగుతాడో అని ఆలోచించాను కానీ అసలు డబ్బే ముఖ్యమనుకుంటే అతనీ దశలో వుండేవాడు కాదుకదా! అన్ని బంధాలూ ఆర్థికమే అనుకున్నాను. కళాకారుడికి డబ్బే కాకుండా ఇంకా ఇవ్వాల్సిందేమిటో ఈరోజు నాకర్థమయింది.

పద్యం తన స్టేజీలో తను హుందాగా నిష్క్రమించాడు. ★